క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ గాంధీ బొమ్మ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్య నిర్వాహక ఇంజినీర్ (విజయవాడ టౌన్) బీవీ సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు భవానీపురం బ్యాంక్ సెంటర్, సుధాకర్ మెడికల్ షాప్ రోడ్డు, గాంధీ బొమ్మ రోడ్డు, చర్చి రోడ్డు, కోళ్లఫారం రోడ్డు, డాల్ఫిన్ బార్ రోడ్డు, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన వివరించారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖతో సహకరించాలని కోరారు.

కొండ ప్రాంతాల్లో ఫుట్ పెట్రోలింగ్



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాసమహల్ కొండ ప్రాంతంలో మంగళవారం పోలీసులు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. కొత్తపేట సీఐ గణేష్ నేతృత్వంలో సెక్టార్ ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, ఇతర పోలీసు సిబ్బంది శ్రీనివాసమహల్, సుబ్రహ్మణ్య స్వామి గుడి అడ్డరోడ్డు ప్రాంతాల్లో పర్యటించారు. శ్రీనివాస మహల్ వద్ద బస్టాప్‌లో బస్సు కోసం వేచి ఉన్న విద్యార్థినులతో మాట్లాడారు. స్థానికంగా ఎదురవుతున్న సమస్యల గురించి మహిళలకు అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం వేళ యువకులు గుంపులుగా రోడ్డుపై నిలిపిన ద్విచక్ర వాహనాలు, ఆటోలలో కూర్చుని ఇబ్బందికరంగా వ్యవహరిస్తున్నారని పలువురు సీఐకి ఫిర్యాదు చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చునని ఆయన సూచించారు.

రోలర్ స్కేటింగ్ పోటీల్లో పతకాలు సాధించిన కృప హర్షిత



భవానీపురం(విజయవాడపశ్చిమ): జిల్లా స్థాయిలో ఇటీవల జరిగిన రోలర్ స్కేటింగ్ పోటీలలో స్థానిక నెల్లూరు రవీంద్రభారతి పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న కలువకొల్లు కృప హర్షిత పలు పతకాలను సాధించింది. అండర్ 14 విభాగంలో రింక్ -5, రింక్-6, రింక్-7లలో బంగారు పతకాలను పొందింది. రాష్ట్ర స్థాయిలో అండర్ 14 - 17 విభాగం రోడ్-3లో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఈ సందర్భంగా విజేత కృప హర్షితను పాఠశాల జనరల్ మేనేజర్ శివారెడ్డి, డీన్ శ్రీకాంత్, ఏజీఎం కేశవరాజు, ప్రిన్సిపాల్ మీనాక్షి శైలజ, ఉపాధ్యాయులు అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో రాణించిన హేమంత్



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో శ్రీగౌతమ్‌కు చెందిన విజ్జి హేమంత్‌కుమార్ ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమని స్కూల్ కరస్పాండెంట్ నల్లాని సూర్యారావు అన్నారు. స్కూల్ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో హేమంత్‌కుమార్‌ను ఆయన అభినందించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఈనెల 10వ తేదీన నిర్వహించిన పోటీలలో అండర్-13 విభాగంలో హేమంత్‌కుమార్ ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. జూన్ నెలలో జరిగే అంతర్జాతీయ చెస్ పోటీలకు హేమంత్‌కుమార్ ఎంపిక కావడం తమ పాఠశాలకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో చెస్ కోచ్ అవ్వారు రామకృష్ణ, ప్రిన్సిపాల్ తులసి, పలువురు ఉపాధ్యాయులు హేమంత్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని డీవైఈఓ సీఎస్ఎస్ రెడ్డి తెలిపారు. స్థానిక సత్యనారాయణపురం ఎస్ఆర్ఐ కళాశాలలో ప్రాక్టికల్స్ నిర్వహణను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలో ప్రాక్టికల్స్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్
- 52వ డివిజన్‌లో గడపగడపకు మన ఆసిఫ్ కార్యక్రమం



సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్న ఆసిఫ్, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహిళా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఏపీ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. ఆ పార్టీ 52వ డివిజన్ ఇన్‌చార్జి తంగెళ్ల రాము ఆధ్వర్యంలో షేక్ ఆసిఫ్ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి మంగళవారం సాయంత్రం డివిజన్‌లో పర్యటించారు. గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ కార్యక్రమాలను వివరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ సంక్షేమ కార్యక్రమాల అమలులో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ముందు వరుసలో ఉందన్నారు. యావత్ దేశానికే సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అందరికీ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. 52వ డివిజన్‌లో ఇటీవల ఆసరా పథకంలో భాగంగా అక్కచెల్లెమ్మలకు డ్వాక్రా రుణమాఫీ కింద వారివారి ఖాతాల్లో నగదు జమ అయిందన్నారు. నియోజకవర్గంలోనే అత్యధికంగా 3.25 కోట్ల రూపాయలు ఈ డివిజన్ అక్కచెల్లెమ్మలకు ప్రభుత్వం చెల్లించిందని వివరించారు. మొత్తం నాలుగు దఫాలుగా సుమారు 13 కోట్ల రూపాయలు ఈ ఒక్క డివిజన్‌లోని అక్కచెల్లెమ్మల ఖాతాల్లో పడటం గొప్ప విషయమని ఈ విషయం ప్రజలు గమనించాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి, ఎన్నిక వాగ్దానాల అమలుపై చిత్తశుద్ధి ఉన్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. కార్యక్రమంలో ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల, కార్పొరేటర్లు చైతన్యరెడ్డి, యలకల చలపతిరావు, శీరంశెట్టి పూర్ణచంద్రరావు, ఆర్షద్, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్షుడు విశ్వనాథ రవి, నాయకులు గురు మహంతు మహేష్, టి.శేఖర్‌రెడ్డి, రాజా తదితరులు పాల్గొన్నారు.

పొత్తుల కోసం చంద్రబాబు దిగజారుడు రాజకీయాలు

వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్



39వ డివిజన్ పర్యటనలో ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న షేక్ ఆసిఫ్, మేయర్ భాగ్యలక్ష్మి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు పొత్తుల కోసం ఎంతకైనా దిగజారుతాడని ఏపీ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. విద్యాధరపురం 39వ డివిజన్‌లో మంగళవారం గడపగడపకు మన ఆసిఫ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ గుడివాడ నరేంద్రతో కలిసి డివిజన్‌లో ఇంటింటికీ తిరిగారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు గతంలో ప్రధాని మోదీపై అసెంబ్లీ సాక్షిగా తీవ్ర పదజాలంతో దూషించారన్నారు. ఈ ఎన్నికల్లో తిరిగి బీజేపీతో పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారన్నారు. టీడీపీ, జనసేన కూటమికి అభ్యర్థులు లేరన్నారు. చంద్రబాబు ఎన్ని పార్టీలతో పొత్తులు పెట్టుకున్నా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయమని స్పష్టం చేశారు.

ఈ ప్రభుత్వంలోనే అభివృద్ధి

పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి జరిగిందని ఆసిఫ్ అన్నారు. 39వ డివిజన్‌లో నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాలలు అభివృద్ధి చేశామన్నారు. 12 సీసీ రోడ్ల నిర్మాణం, కరెంటు స్తంభాల ఏర్పాటు, వాటర్ పైపులైన్ నిర్మాణంతో పాటు అనేక మౌలిక సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ తిరిగి అధికారంలోకి వస్తే ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టర్ శేఖర్ రెడ్డి, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ కేసరి చిన్నోడు, పాత శివాలయం చైర్మన్ బొమ్మ మధు, కార్పొరేటర్లు చైతన్యరెడ్డి,, యలకల చలపతిరావు,, షేక్ ఇర్ఫాన్, నాయకులు హయత్, ఏలూరు వెంకన్న డీవీ రెడ్డి రుద్రా శంకర్, రాజు వెంకట ఈశ్వరి, ముంతాజ్ బేగం, శ్రీకాంత్, కోసూరి ఫణి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ట్రాఫిక్ డీసీపీ చక్రవర్తి



రోడ్డు భద్రతపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ డీసీపీ చక్రవర్తి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సురక్షితమైన డ్రైవింగ్, రోడ్డు భద్రత నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ట్రాఫిక్ డీసీపీ ఒ.చక్రవర్తి ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. మంగళవారం సత్యనారాయణపురం, గాయత్రి ఫంక్షన్ హాలులో మూడవ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ట్రాఫిక్ డీసీపీ చక్రవర్తి మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు, రోడ్డుపై నడిచే పాదచారులకు ట్రాఫిక్ పట్ల అవగాహన కల్పించి తద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించే ఉద్దేశంతోనే అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు జరిగిన రోడ్డు ప్రమాదాలలో ఎక్కువ శాతం మానవ తప్పిదాలు, డ్రైవర్ల నిర్లక్ష్యం వలనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రజలు వీటిని గుర్తించి తమకు తాముగా ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై అప్రమత్తంగా వ్యవహరిస్తే తప్పకుండా ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పడతాయన్నారు. ఎక్కువ మంది అవగాహన లోపంతోనే ప్రమాదాల బారిన పడటమే కాకుండా ఎదుటి వారి ప్రాణాలకు కూడా ముప్పు కల్పిస్తున్నారని అన్నారు. ఇటువంటి చర్యల కారణంగా ఎంతోమంది ప్రాణాలను కోల్పోవడం, క్షతగాత్రులు అవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. అనంతరం సమావేశంలో పాల్గొన్న ఆటో డ్రైవర్లతో మోటారు వాహనచట్టాలకు లోబడి డ్రైవింగ్ చేస్తామని, రహదారి నియమ నిబంధనలు, రహదారి భద్రతలు పాటిస్తామని, ఎదుటి వారి ప్రాణాల పట్ల జాగ్రత్త వహించి డ్రైవింగ్ చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏడీసీపీ డి.ప్రసాద్, ట్రాఫిక్ ఏసీపీ జి.శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ ఒ.అహ్మద్ ఆలీ, సిబ్బంది, సుమారు 250 మంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



విద్యార్థి వెంకట తనిష్ రెడ్డిని అభినందిస్తున్న అధ్యాపకులు

కంకిపాడు: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు సత్తా చాటారు. విద్యాసంస్థల కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో శ్రీ చైతన్య ఐఐటీ అకాడమీ ఎగ్జిక్యూటివ్ డీన్ కె.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఎం.మురళీకృష్ణ మాట్లాడుతూ జేఈఈ మెయిన్ సెషన్-1 ఫలితాల్లో 300 మార్కులకు 300 మార్కులను అన్నారెడ్డి వెంకట తనిష్‌రెడ్డి సాధించాడన్నారు. నూరు శాతం 14 మంది, ఫిజిక్స్‌లో 100 శాతం 12 మంది, కెమిస్ట్రీలో 22 మంది సాధించారన్నారు. 99 శాతం పర్సంటేజ్ 288 మంది సాధించారని చెప్పారు. విద్యార్థుల అభ్యున్నతి లక్ష్యంగా బోధన అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీన్స్ పీవీఆర్, మురళీ రావు, కృష్ణారెడ్డి, శరత్ పాల్గొన్నారు.

మహిళల్లో రక్తహీనత లేకుండా ప్రభుత్వ చర్యలు

కార్పొరేటర్ మైలవరపు మాధురీ లావణ్య



అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ మాధురీ లావణ్య

భవానీపురం(విజయవాడపశ్చిమ): మహిళల్లో రక్తహీనత లేకుండా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురీ లావణ్య తెలిపారు. డివిజన్ పరిధిలోని ఏకలవ్యనగర్‌లో గల అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల మహిళలకు ప్రాధాన్యతనిచ్చే క్రమంలో వారి ఆరోగ్యాన్ని సంరక్షించే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి ఉచిత రక్తపరీక్షలు చేసి మందులు అందజేస్తోందన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, 6 ఏళ్ల వయసులోపు చిన్నారులు రక్తహీనతకు లోనుకాకుండా పాలు, గుడ్లు తదితర బలవర్ధకమైన ఆహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తోందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థను రూపొందించి వైద్యులు ఇంటికే వచ్చి ఆరోగ్యాన్ని పరీక్షించటం, అనారోగ్యంగా ఉంటే మందులు ఇచ్చే కార్యక్రమాన్ని జగనన్న ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దటమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు పని కల్పించాలి

రైల్వే కాంట్రాక్ట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు



డీఆర్‌ఎం కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): కార్మిక చట్టాలను అనుసరించకుండా నిబంధనలకు విరుద్ధంగా పనిలో నుంచి తొలగించిన రైల్వే కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం డీఆర్‌ఎం కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వి.వి.ఎల్ నరసింహులు మాట్లాడుతూ చట్ట విరుద్ధంగా పనుల నుంచి తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులు ఏడు నెలలుగా పోరాడుతుంటే నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. ఈ నెల 20లోగా కార్మికులకు పని కల్పించి రైల్వే అధికారులు కార్మిక చట్టాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని చెప్పారు.
కార్యక్రమంలో సీఐటీయూ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి ఈవీ నారాయణ, నాయకులు ఆదిలక్ష్మి, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ మనాక్‌లో బీఆర్ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తూ సర్టిఫికెట్స్‌ను అందజేస్తున్న బెజవాడ రాజారావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనాక్ అవార్డ్స్ పోటీలో ప్రదర్శించిన ప్రాజెక్టులలో విద్యాధరపురంలోని బెజవాడ రాజారావు హైస్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. నగరంలోని లయోల కళాశాల వేదికగా సోమవారం జరిగిన జిల్లా స్థాయి సైన్స్ పోటీలో 'రైలు ప్రమాదాల నివారణ' అనే ప్రాజెక్టును బెజవాడ రాజారావు హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న రంగాల హరిప్రియ, దరావతు లిఖిత్ సాయి కిరణ్ ప్రదర్శించారు. సైన్స్ ఉపాధ్యాయుడు తంబళ్ల అశోక్ కుమార్ నిర్దేశకత్వంలో తయారు చేసిన ఈ ప్రాజెక్టును విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా మంగళవారం హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ప్రాజెక్ట్ ప్రదర్శించిన విద్యార్థులను హైస్కూల్ కరస్పాండెంట్ బెజవాడ రాజారావు అభినందించారు.

టిడ్కో గృహ సముదాయాల పరిశీలన



టిడ్కో గృహ సముదాయాల ప్లాన్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, అధికారులు

పటమట(విజయవాడతూర్పు): పేద ప్రజలకు ప్రభుత్వం నిర్మిస్తున్న టిడ్కో గృహాలను త్వరితగతిన పూర్తి చేసి వారికి అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. ఆమె జక్కంపూడిలోని టిడ్కో గృహ సముదాయాలను మంగళవారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఎలాంటి లోపం లేకుండా నిరంతర అధికారులు నిరంతర పరిశీలన చేయాలని అధికారులకు సూచించారు. పేద మధ్యతరగతి కుటుంబాలకు సంపాదిస్తున్న వేతనంలో అద్దె రూపంలో వెళ్లిపోవటం వల్ల వాళ్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అటువంటి ఇబ్బందులు దూరం చేసేందుకే పేద, మధ్యతరగతి ప్రజలకు సొంతిల్లు కల్పించాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయమన్నారు. గృహాల నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. పర్యటనలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి జోగి రమేష్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు



మంత్రి జోగి రమేష్, తిరుపతిరావును కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సర్నాల తిరుపతిరావును వివిధ మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు, సెర్ప్ రిసోర్స్ పర్సన్‌లు ఇబ్రహీంపట్నంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇన్‌చార్జ్ తిరుపతిరావుకు అభినందనలు తెలిపారు. మైలవరం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ మరోసారి విజయం సాధించేలా సమన్వయంతో పనిచేయాలని నాయకులకు మంత్రి సూచించారు. కొండపల్లి వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ల నిర్మించుకున్న వారికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇప్పించాలని 27వ వార్డు కౌన్సిలర్ మామిళ్లపల్లి చైతన్య స్రవంతి, ఐవోసీ ఆనంద్ కోరారు. వివిధ మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పోస్ట్ కోవిడ్ రోగులకు వైద్యుల సలహాలు తప్పనిసరి



ప్రొజెక్టర్ ద్వారా వివరిస్తున్న శ్రీనివాసరావు

ఆటోనగర్(విజయవాడతూర్పు): కరోనా వచ్చిన వారంతా భవిష్యత్‌లో ఆరోగ్యంగా ఉండేందుకు తప్పని సరిగా వైద్యుల సూచనలు తీసుకోవడం మంచిదని అమెరికాకు చెందిన బయో అమెరికా రీసెర్చ్ సీనియర్ ఉపాధ్యక్షుడు డాక్టర్ వి.శ్రీనివాసరావు అన్నారు. ఆటోనగర్‌లోని విజయవాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ హాలులో మంగళవారం సాయంత్రం వ్యాధి నిరోధక శక్తి, కోవిడ్-19 ఇన్‌ఫెక్షన్ నుంచి రక్షణపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కరోనా వచ్చిన వారు గత రెండు సంవత్సరాల నుంచి అధికంగా గుండె సంబంధిత వ్యాధులకు గురవుతున్నారన్నారు. లంగ్స్, ఊపిరితిత్తులతో పాటు పలు అవయవాలకు కూడా ముప్పు వాటిల్లుతోందన్నారు. కరోనా వచ్చిన తర్వాత శరీరంలో అనారోగ్య పరిస్థితులు వస్తే అశ్రద్ధ చేయకుండా వెంటనే సమీపంలోని వైద్యులను సంప్రదించడం ద్వారా ప్రమాదం నుంచి బయటపడవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎంఎస్ఎంఈ గౌరవ అధ్యక్షుడు బాయన వెంకట్రావు, అసోసియేషన్ కార్యదర్శి టీవీ నాగేశ్వరరావు, జేఆర్‌డీ టాటా ఐలా కార్యదర్శి టి.శ్రీనివాసరావు, ఏపీ ఎంఎస్ఎంఈఐఏ కార్యదర్శి ఎంఎస్ రామచంద్రరావు పాల్గొన్నారు.

ఐఓసీలో వన మహోత్సవం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) ఎల్‌పీజీ ప్లాంట్‌లో సామూహిక వన మహోత్సవ కార్యక్రమం మంగళవారం జరిగింది. చీఫ్ మేనేజర్ రామారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈడీ అనిల్ కుమార్, జనరల్ మేనేజర్ యోగరాణి సురేష్ మాట్లాడుతూ కాలుష్యం నివారణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని చెప్పారు. అనంతరం వివిధ రకాల మొక్కలు నాటారు. డీజీఎం వి.కుమార్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భవానీపురం(విజయవాడపశ్చిమ): సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ విజయవాడ అర్బన్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ అధికారి టి.నాగమణి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గం 45వ డివిజన్‌లోని న్యూ జోజినగర్-3 అంగన్‌వాడీ కేంద్రంలో(ఓసీ), సెంట్రల్ నియోజకవర్గం 63వ డివిజన్‌లోని రాజీవ్‌నగర్-7 అంగన్‌వాడీ సెంటర్ (ఓసీ - ఆర్థికంగా బలహీన వర్గం), అదే నియోజకవర్గంలోని రాజీవ్‌నగర్ వడ్డెర కాలనీలోగల కేంద్రంలో (ఓసీ), 59వ డివిజన్ లూనా సెంటర్-2 అంగన్‌వాడీ కేంద్రంలో (ఓసీ) ఒక్కొక్క పోస్టుకు ఆయా ప్రాంతాలకు చెందిన వివాహితురాలైన అభ్యర్థినులు మాత్రమే దరఖాస్తు చేయాలని వివరించారు. అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టుకు 10వ తరగతి ఉత్తీర్ణురాలై ఉండాలని, 2023 జూలై ఒకటి నాటికి 21 ఏళ్లు నిండి 35 ఏళ్ల లోపు ఉండాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కులధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువపత్రం, ఆధార్, రేషన్ కార్డు, ఆర్థికంగా బలహీన వర్గం అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాల జిరాక్స్‌లను జతపరచాలని సూచించారు. ఆధార్, రేషన్ కార్డుల జిరాక్స్ కాపీలపై గెజిటెడ్ ఆఫీసర్‌తో అటెస్ట్ చేయించి ప్రస్తుత పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో జతపరిచి ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఉమాశంకర్ నగర్ ఒకటవ లైన్, ఎస్ఎస్ఆర్ అకాడమీ, కానూరులోని సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం అధికారి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్, విజయవాడ అర్బన్ కార్యాలయంలో దరఖాస్తులను వ్యక్తిగతంగా అందజేయాలని తెలిపారు. పూర్తి వివరాలకు 94408 14595 నంబరులో సంప్రదించాలని కోరారు.

రంజింప చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీ నటరాజ సాంస్కృతిక కళాపీఠంకు చెందిన కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను రంజింపచేసింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై చిన్నారులు పల్లవి, కణ్వల, ఉజ్వల సాయి, నిత్యశ్రీ, అనిత, జ్ఞాన దీపిక, చార్వి, దీపిక, సహస్ర, నిర్వాణ పలు కీర్తనలకు చక్కటి అభినయంతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన అధికారులు ప్రసాదాలను అందజేశారు.

జగన్‌ను మళ్లీ సీఎంను చేయడమే లక్ష్యం

మైలవరం: వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు అన్నారు. మైలవరంలోని మార్కెట్ యార్డు కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డిని నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరావు మంగళవారం కలిసి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయానికి సహకరించాలని కోరారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని, ఆ లక్ష్యాన్ని పూర్తి చేయడానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు.

హనిమిరెడ్డిని కలిసిన ఏసీపీ, సీఐలు

మైలవరం: ప్రవాసాంధ్రుడు, విద్యా దాత డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డిని మైలవరం డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్.మోహనరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.కిశోర్‌బాబు మంగళవారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మైలవరం అభివృద్ధికి డాక్టర్ హనిమిరెడ్డి చేస్తున్న సేవలను ప్రశంసించారు. మైలవరంలో విద్యా వ్యాప్తికి లకిరెడ్డి సోదరులు చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. మైలవరం, వెల్వడం గ్రామాల సర్పంచ్‌లు గరికిపాటి మంజు భార్గవి, ప్రత్తిపాటి ధర్మరాజు, ఎంపీటీసీ ఉదయ్ భాస్కర్‌రెడ్డి, వార్డు సభ్యులు శీలం కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలోని వెనుకబడిన తరగతులకు సంక్షేమ భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని)కి వినతిపత్రం సమర్పించారు. విస్సన్నపేట మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంపీని కలిసిన బీసీ సంక్షేమ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు డి. శ్రీనివాసరావు, సభ్యులు కాలసాని గోపాల నాగేశ్వరరావు, పరసా నెహ్రూ, మాయిరి వెంకటరమణ తదితరులు బీసీ సంక్షేమ భవన నిర్మాణ ఆవశ్యకతను వివరించారు.